# అడిగి వచ్చిన వరం

ఇంకా సూర్యోదయం కాలేదు. బస్సు అవినాశ మండపం దగ్గర ఆగి, ప్రయాణీకుల్ని దింపి, మళ్ళీ ముందుకు సాగిపోయింది. రాత్రంతా ఆకాశాన నడయాడుతూ వచ్చిన కారెనుముల్లాంటి మేఘాలు అప్పుడప్పుడే పలచబడి దిక్కుల చివళ్ళకు జారుకుంటున్నాయి. ఉండివుండి పడుతూ వచ్చిన వానజల్లుల్లో తడిసిన కొండలు, కోనలు, అడవులు, తోపులు సుష్టుగా భోంచేసి చల్లటి అరుగుపైన కూర్చున్న పెళ్ళిపెద్దల్లా ఆనందముద్ర పట్టినట్టున్నాయి. 'అవినాశ మండపం' అని రాసివున్న రాతి కట్టడంలో ఒళ్ళంతా ముడుచుకుని మాంసపుముద్దల్లా నిద్రపోతున్న దేశ దిమ్మరులు కొందర్ని మినహాయిస్తే ఆ ప్రాంతం నిర్జనమేనని చెప్పొచ్చు. అడివికి సరిహద్దు రేఖలా సాగిపోతున్న రోడ్డు, మరొకవైపున దట్టంగా మామిడి తోటలు, అడవిపూల సుగంధాన్ని మోసితెస్తూ, మనసును ఏ దివ్యలోకాలలోకో తీసుకెళ్ళిపోతున్న మందపవనాలు. దేశంలో ఒకచోటినుంచి ఇంకొకచోటికి ప్రయాణం చేసి వచ్చినట్టులేదు నాకా అనుభవం. పాదలేపన ప్రభావంవల్ల అమాంతంగా గాలిలో తేలివెళ్ళి అక్కడ వాలిపోయినట్టుంది.

బస్సులో నుంచి దిగిన నలుగురు ప్రయాణీకులలోనూ నేనొక్కణ్ణి. పైజమాలుగా, జుబ్బాలుగా, వెయిస్టుకోటులుగా దిగిన తోడి ప్రయాణీకులిద్దరు దూరంగా వేరుపడి నిల్చుని ఏ గుజరాతీలోనో, మరాఠీలోనో మాట్లాడుకుంటున్నారు, అడ్డపంచపైన అరచొక్కా తొడుక్కుని, భుజాన తువ్వాలు వేసుకున్న నాలుగో అతను మాత్రం ఒక పలుకుతోడుకోసం ఆశిస్తున్నట్టే తోచింది. నన్ను దాటుకుని ముందుకు వెళ్ళబోతూ ఓ క్షణం ఆగి అతడడిగాడు

"ఏమండి సార్! మీరు గూడా ఆశ్రమానికి వొస్తిరా?"

"అవునండీ! నేను రావడం ఇదే మొదటిసారి" అన్నాను.

"పరవాలేదు, నేనింతకు ముందర రెండుసార్లు వచ్చినాను. శీఘ్రంగా నడిస్తే అంతా ఒక గంటసేపట్లో ఆశ్రమంలో ఉండొచ్చును."

"నడిచే వెళ్ళాలా? వెహికల్స్ ఉండవా?" అడిగాను.

"ఆశ్రమానికి వ్యాన్లూ, లారీలు వున్నాయి. కానీ అది చాలా చుట్టుదారి. ఆరోగ్యంగా ఉండేవాళ్ళంతా మామూలుగా ఈ అడ్డదారిలోనే నడిచివెళ్తారు."

రోడ్డు మలుపులు తిరగడం వల్ల తెలిసిందికాదుగానీ వందమీటర్లు నడిచేలోగా తారు రోడ్డునుంచి చీలి ఈశాన్యంగా వెళ్తున్న మట్టిబాట ఒకటి ఎదురైంది. పచ్చటి చిట్టడవిలో సన్నటి, తెల్లటి దారి. ఆ చిట్టడవిలో గూడా ఎత్తుప్రకారం నిల్చోపెట్టినట్టు ముందుకు వెళ్ళినకొద్దీ చెట్లు పొడవుమీరిపోతున్నాయి. ఫర్లాంగు దూరం నడిచేటప్పటికి అవి దారిపైన ఆర్చిలా క్రమ్ముకున్నాయి.

"ఏదో మరో ప్రపంచంలోకి వెళ్ళిపోతున్నట్టుంది" అన్నాను.

"చూసి తీరాల్సిన స్థలంలెండి! ముందటి యుగాల్లో కింపురుషులనే దేవతా జాతివాళ్ళు వాలాయంగా అక్కడికొచ్చి ఆటాపాటా, విందూ వినోదం చేసుకునేవాళ్ళట. అందువల్లనే ఆ తీర్థానికి కింపురుష తీర్థమని పేరొచ్చింది. తీర్థం పక్కన బండరాయి పైన చెక్కిన ఆంజనేయస్వామి రూపం, దానిపైన ఒక చిన్న దేవళం ఉండేవట. ఆడికో, అమావాస్యకో

కొందరు భక్తులు అక్కడికొచ్చి ఒక టెంకాయ కొట్టి, ఇంత కర్పూరం వెలిగించి తమదారిలో తాము పోయేవాళ్ళట. స్వామి అత్మానంద అవధూత గూడా అట్లా భక్తులతో కలిసి వచ్చినవారేనట. స్వాముల వారికీ చోటు బాగా నచ్చిపోయింది. దాంతో ఆశ్రమం ఏర్పాటు చేయాలనే సంకల్పం కలిగింది. 'అప్పటమైన నీళ్ళు, వన మూలికల పైన్నుంచీ వచ్చేగాలి, గలాటా అనే మాటలేదు. ఇంతకంటే మించిన తావా?' అనుకున్నాడేమో! ఇదంతా నలభై యేళ్ళక్రిందటి సంగతి. ఇప్పుడాయన శిష్యులు అంతా గురువుగారి పద్ధతిలోనే ఆశ్రమం నడుపుకొస్తున్నారు..."

కింపురుష తీర్థంలోని ప్రకృతి చికిత్సాశ్రమాన్ని గురించి నేను గూడా విని వున్నాను. దీర్ఘరోగాలవాళ్ళు, తీరని మనోవ్యాధులవాళ్ళు అక్కడి కొస్తుంటారట. శారీరక ప్రకృతికి అనువైన చికిత్సావిధానాల వల్ల, ప్రశాంత వాతావరణంలో మానసికోద్వేగాలను తగ్గించడం వల్ల అక్కడ ఎలాంటి మొండి జబ్బులనైనా నివారించగలుగుతున్నారని ప్రతీతి. నాగరిక ప్రపంచం అనేక కారణాలవల్ల నివాసయోగ్యం గాకపోయినకొద్దీ మానవుడు కొత్త ఆశ్రయాలు వెదుక్కోక తప్పడం లేదు. అలాంటి వాటిలో ఈ ఆశ్రమం గూడా ఒక్కటేమో!

దారిలో ఓ చిన్న గుట్ట అడ్డు తగిలింది. దిగి లోయలోకి వెళ్ళడానికి మెట్లున్నాయి. నీలిడేరా లాంటి ఆకాశం, కోటగోడలాంటి కొండల ప్రాకారం, తామరాకులు పరచుకోడం వల్ల నీళ్లు కనిపించకుండా పోయిన కొండకొలనులాంటి లోయ. వివిధ వర్ణ సమ్మేళనంలా విరబూసిన పూలగుత్తులు. నల్లగుండ్ల మధ్యనుంచి రాతిబండలపైన దిగజారుతున్న సెలయేళ్ళు, దూదిపింజలాంటి తెల్లటి మబ్బులో నుంచీ ప్రసరిస్తున్న లేత సూర్యకిరణాల్లో మిసమిసలాడిపోతూ అది ఏ కిన్నర, కింపురుష లోకాలకో చెందిన దృశ్యంలా ఉంది. అక్కడ కాసేపు కూచున్నాము.

"రెస్టు తీసుకోవడం కోసం మీరప్పుడప్పుడు ఇక్కడి కొస్తుంటారా?" మెల్లగా నా మార్గదర్శిని నేను మాటల్లోకి దించాను.

"రెస్ట్ సంగతి సరే! అదిక్కడికి ఎవరొచ్చినా దొరుకుతుంది. పోతే అందమైన సీనరీ చూడ్డానికైనా ఇక్కడికి రావచ్చు. అయితే నేనిక్కడికి వచ్చేందుకు ఈ రెండూ గాక వేరే కారణముంది. మా పెదనాయనకు బిడ్డల్లేరు. నేను నా చిన్నప్పుడు మా పెద్దనాయన దగ్గర్నే పెరిగితిని. ఆదినుంచీ ఆయన్ది కొంచెం వేదాంత ధోరణి. రెండేండ్లకు ముందు మా పెద్దమ్మ చనిపోయింది. ఆ పైన ఆయన ఇక్కడికొచ్చి సెటిలైపోయిరి. డెబ్భైయేండ్ల ముసలాయన. ఏడాది కొకసారైనా వచ్చి నాలుగు రోజులు కలిసుంటే సంతోషిస్తారు..."

"ఇంతకూ మీ స్వస్థలమేదో చెప్పనేలేదే!" అన్నాను.

"చూస్తిరా! నా బుద్ధిశాలితనం అంతలో ఉంది. అసలొకప్పుడు మేమున్నూ తెలుగోళ్ళమే. మా తాతగారి హయాంలో మాది సూళ్ళూరుపేట. మా నాయన పెదనాయన ఉద్యోగాలు వెదుక్కుంటూ మదరాసు వెళ్ళి చేరిపోయిరి. చింతాద్రిపేటలో మా యిల్లు. నేను ఉద్యోగం జోలికిపోలా. వాల్‌టాక్సు రోడ్డులో ఒక ఫర్నిచర్ మార్ట్ ఉంది. 'త్యాగూ ఫర్నిచర్ మార్ట్' నా పేరదేలెండి, త్యాగరాజన్."

సంభాషణ అంతటితో తెగిపోయేదేగానీ, ఈసారి త్యాగరాజనే చొరవ తీసుకున్నాడు. "అయితే మీరేం పనిమీద వొస్తున్నారో ఇక్కడికి?"

నేను కాస్త నీళ్ళు నమిలాను. ఎదుటివాడి వివరాలన్నీ తెలుసుకున్నాక సొంత విషయాలు చెప్పకపోవడం భావ్యంగాదు. అయితే ఎవరికోసమైతే వెళ్తున్నానో, అతడి

పేరు బయట పెట్టడానికి వీల్లేని పరిస్థితి. ఆ ధర్మ సంకటాన్ని సూచిస్తూ, గుంభనంగానే కొనసాగించాను.

"ఓ బాల్యస్నేహితు డిక్కడున్నాడని తెలిసింది. తెలిసిందంటే ఇతరుల ద్వారాగాదు అతడే రాశాడు. కానీ కొన్ని కారణాలవల్ల తన ఉనికిని గోప్యంగా ఉంచమన్నాడు. మిస్టర్ త్యాగరాజన్! జీవితం ఎంత విచిత్రంగా ఉంటుందో తెలుసుకోవాలంటే మీరతడి కథ వినాలి. హైస్కూల్ చదువు పూర్తికావడంతోటే మేము విడిపోయాము. నేను టీచర్స్ ట్రెయినింగ్ ముగించుకుని పల్లెకు వెళ్ళిపోయాను. అతడు పై చదువుల అంతుచూడాలని పట్నం చేరుకున్నాడు. అమోఘమైన తెలివితేట లతడివి. ప్రతి క్లాసులోనూ ఫస్టురాంకే తెచ్చుకుంటూ వచ్చాడు. చూడ్డానికి మనిషి కాస్త నదురుగాకూడా వుండేవాడేమో, ఓ లక్షాధికారి కూతురు అతణ్ణి ప్రేమించింది. పెళ్ళయింది. ఇదంతా జరిగింది యాభైకి అరవైకి మధ్యలో. మేము బాల్యస్నేహితులం మాత్రమేగాదు, ప్రాణస్నేహితులం గూడా. ఒక వూళ్ళో పుట్టి పెరిగాము. చిన్నతనంలోనే అతడికి తండ్రిపోయాడు. ఎలిమెంటరీ స్కూలు వదిలిపెడుతూన్నమనగా తల్లిగూడా కళ్ళుమూసింది. బస్తీలో రూము తీసుకుని, హోటల్లో భోంచేస్తూ చదువుకున్నాం. ఉన్న ఆస్తిపాస్తులన్నీ తెగ నమ్ముకుని, పల్లెతో తెగతెంపులు చెప్పుకుని పట్నం వెళ్ళాడు. అక్కడతణ్ణి సిరి వరించింది. అదృష్టంగూడా కలిసొచ్చింది. నాలుగైదు మేడలు, రెండో మూడో కార్లు, రియల్ ఎస్టేట్లు, షేర్ మార్కెట్లు, ఫ్యాక్టరీల్లో వాటాలు, లిమిటెడ్ కంపెనీలు, వివిధ నగరాల్లో డైరెక్టర్ల మీటింగులు, విమాన ప్రయాణాలు – ఇలా వ్యాపకాలు పెరిగిపోతూ వచ్చాయి. నేనీ ముప్పై యేళ్ళలో ఎంతలేదన్నా పది పన్నెండు సార్లు అతణ్ణి కలుసుకోడంకోసం వెళ్ళి ఉంటాను. వాడి పి.ఎ. పరమస్ట్రిక్టు. ఎంగేజిమెంటు కుదుర్చుకోందే వాడబ్బ ఫాలాక్షునికైనా ఇంటర్వ్యూ దొరికేది గాదు. ఒకవేళ దొరికిందో, వెళ్ళికూచుని పలకరించేటప్పటికి టేబిలుపైన ఉన్న మూడు నాలుగు ఫోన్లలో ఒకటి ట్రింగు ట్రింగుమంటూ మోగేది. ఎవరో గెస్టువస్తున్నాడు, ఏరో డ్రోముకి వెళ్ళాలి, లేదా అలాంటి పనే ఇంకొకటి. వెయిటింగు రూములో కూచోమని చెప్పి వెళ్ళిపోయాడంటే అంతే సంగతులు. నేనొకణ్ణి వేచి ఉన్నానన్న సంగతి గూడా గుర్తుండేది గాదు. వెళ్ళి వెళ్ళి విసిగిపోయి ఇప్పటి కయిదారేళ్ళుగా అటువైపు తిరిగి చూడ్డమే మానేశాను. ఇదిగో ఇప్పుడీ ఉత్తరం 'చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకోవాలని ఉందిరా శేఖరం! ఒకసారి వచ్చి వెళ్ళవూ?' అని ప్రాధేయపడుతూ రాశాడు. బాల్యస్మృతుల్ని నెమరువేసుకోవాలని అనుకుంటున్నాడంటే, అతడు తిరగాల్సిన తిరుగుళ్ళన్నీ తిరిగి తిరిగి మళ్ళీ ఒడిలోకే వచ్చాడన్నమాట. ఏమంటారు మిస్టర్ త్యాగరాజన్!"

త్యాగరాజన్ ఏమీ అనలేదు. జీవితంలోని వైచిత్రిని ఊహిస్తున్నట్టు మౌనంగా ఉండిపోయాడు.

కొండ మెట్లు దిగి, తరుశాఖల కింద నడిచి, ఎనిమిదింటికల్లా ఆశ్రమ ప్రాంతంలో అడుగుపెట్టాము. ఆ లోయకంతా కేంద్ర స్థానంలో ఉంది కింపురుషతీర్థం. స్నాన సదుపాయంకోసం అక్కడక్కడా ముచ్చటగా మెట్లు కట్టించారు. తీర్థంచుట్టూ నందన వనమన్న పేరుతో పెద్ద పార్కు ఒకటి నెలకొల్పారు. పార్కుకు ఆనుకున్నట్టుగా పూలమొక్కల నడుమ మట్టిబాట. దానికావల అర్ధచంద్రాకారంగా ఆశ్రమవాసుల నివాసంకోసం సిమెంటు రేకుల ఆవాసాలు, గ్రంథాలయానికి, ధార్మికోపన్యాసాలకు సభా మందిరాలు, అన్నింటికీ మధ్యగా కార్యాలయ భవనాలు – ఆ ప్రదేశంలో నడుస్తుంటే గొప్ప కళాదర్శకుడు వేయించిన భారీ సినిమా సెట్టింగు మధ్య నడయాడుతున్నట్టే ఉంది.

పేరు, విలాసం, వచ్చిన తేదీ, సమయం, వచ్చిన పని మొదలైన వివరాలన్నీ నమోదుచేసి, ప్రవేశ దరఖాస్తుల్ని ఎంక్వయిరీలో నివేదించుకున్నాము. ఏ హాల్లో, ఏ గది దగ్గర వేచివుండాలో నిర్దేశిస్తూ మాకు చీటీలిచ్చారు. ఆశ్రమరివాజు మేరకు భోజనానికి, వసతికి డబ్బులు వసూలు చేసుకుని, రసీదులతోబాటు టోకన్లుగూడా ఇచ్చారు. ఉపాహారం తీసుకున్నాక త్యాగరాజన్ క్యాంటీన్ దగ్గర విడిపోయాడు.

సోమసుందరం కోసం వేచిచూస్తూ సంజీవనీ హాల్లో, ఇరవై ఆరో నంబరు గది ముందు వేసిన కుర్చీలో కూచున్నాను. నడిచొచ్చిన శ్రమవల్లనేమో, కూచున్న పది నిమిషాలకల్లా కునుకు క్రమ్ముకొచ్చేసింది. హఠాత్తుగా భుజంపైన చల్లటి స్పర్శసోకడంతో ఉలికిపడి కళ్ళు తెరిచాను.

"ఎప్పుడొచ్చావు శేఖరం?"

ఎట్టయెదుట సోమసుందరం నిలబడి ఉన్నాడు.

"ఇక్కడికొచ్చి కూచున్నప్పుడు గంట తొమ్మిది" అన్నాను.

"అప్పటికి నేను చన్నీటి స్నానానికి మునుపు మట్టిపూత పట్టిస్తున్నానేమో!" తాళంతీసి తలుపు తెరుస్తూ అన్నాడు సోమసుందరం – "రా, లోపల కూర్చుందాం."

చాలా కొద్ది క్షణాలు మాత్రమే నేను సోమసుందరం ముఖంలోకి చూడగలిగాను. కన్నీళ్ళు క్రమ్ముకోడంతో చూపులు చెదిరిపోయాయి. కర్కోటకుడనే పాముకాటు వేయడం వల్ల నలుడు కురూపిగా మారిపోయాడన్న కథ వింటుంటాము. మరైతే సోమసుందరాన్ని కాటు వేసిందేది? అకాల వృద్ధాప్యం అతణ్ణి పొదివి పట్టుకుంది. కళ్ళల్లో జీవకళ లేదు. పెదవు లెండిపోయి పిడచగట్టినట్టున్నాయి.

చాలా సేపటి వరకు నెలకొన్న మౌనాన్ని భంగపరుస్తూ అతడు "మాట్లాడవేం శేఖరం?" అన్నాడు.

"ఏం మాట్లాడను సోమసుందరం? ఏమైంది నీకు? డాక్టర్లను ఇంటిముందర పరవళ్ళు తొక్కించగలవాడివి నువ్వు, అవసరమైతే చికిత్స నిమిత్తం అమెరికాకైనా వెళ్ళిరాగలిగినవాడివి నువ్వు, నెలకొకసారి పరిపూర్ణమైన మెడికల్ చెకప్ చేయించుకుంటూ, ట్రీట్‌మెంట్ పుచ్చుకోగలిగిన వాడివి నువ్వు, నువ్వెందుకిలా డీలా పడిపోయావో నాకు తెలియడంలేదు" అన్నాను.

రంగు, రుచి, వాసన లేకుండా కొన్ని నవ్వులుంటాయా? ఉంటాయేమో! సోమసుందరం అలా నవ్వాడు. "నువ్వు చెప్పిన పనులన్నీ చేయించగల సత్తా, డబ్బు కుందని నాకు తెలుసు. అయితే కొన్ని పరిస్థితుల్లో డబ్బెందుకూ కొరగాకుండా వెలవెల పోతుందని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నేను దేన్ని తాకినా అది డబ్బుగా మారింది. నేనెక్కడ చెయ్యిపెట్టినా డబ్బే దొరికింది. అయితే శ్రమలేకుండా వచ్చిపడే డబ్బుంది చూశావా శేఖరం, దానికి మించిన శాపం మరొకటి ఉండదు. మైదాసురాజు దేన్ని తాకినా బంగారమయ్యే వరం కోరుకున్నాడు. కుర్చీని తాకాడు బంగారమైంది.

"గోడను తాకాడు బంగారమైంది. కంచాన్ని తాకాడు బంగారమైంది. తినబోతూ అన్నాన్నీ తాకాడు. అదిన్నీ బంగారమైపోయింది. ఎత్తుకోదలచి బిడ్డను తాకాడు. అదిగూడా నిర్జీవమైన బంగారు బొమ్మైపోయింది. నా గతీ అంతే అయింది. మిత్రులతో, బంధువులతో, పనివాళ్ళతో, ఆఖరుకు నా కుటుంబ సభ్యులతో గూడా నాకు ఆర్థిక సంబంధాలు మాత్రమే మిగిలాయి. అందరూ డబ్బుకోసమే నాచుట్టూ తిరుగుతున్నారని రూఢి అయిపోయింది.

అంతకు మించి ఇంత ప్రేమ, ఇంత మమకారం, ఇంత ఆత్మీయత వాళ్ళకు నాయందు లేకపోయింది. కట్టెలో పుట్టిన అగ్గి కట్టెనే కాల్చేస్తుందట గదూ? నాలో పుట్టిన అసంతృప్తి నన్నే నమిలి తినేయడం మొదలెట్టింది. తిన్న తిండి అరిగి కొన్ని సంవత్సరాలయింది. కంటి నిండుగా నిద్రపోయి కొన్ని సంవత్సరాలైంది. నా మేడల్లో నేను సుఖంగా ఉండలేకపోయాక, నా పట్టుపరుపుల మీద నేను హాయిగా నిద్రపోలేకపోయాక, నా భార్యాబిడ్డల్ని సైతం వీళ్ళు నావాళ్ళని అనుకోలేకపోయాక, ఇక నేను బ్రతకడంలో పరమార్థమేమిటో నాకు తెలియకుండా పోయింది. ఒకప్పుడు ఊరగాయ నంజుకుంటూ చద్దన్నం తింటే పరమానందంగా ఉండేది. చీకటి పడ్డాక మూడుమైళ్ళు నడచివెళ్ళి ఆవులపాళెంలో కంగుందివాళ్ళ విరాట నాటకం చూస్తూ కూచుంటే బ్రహ్మానందంగా ఉండేది. లేతవెన్నెలలు మిసమిసలాడే సాయంకాలపు వేళల్లో మన వూరి ఏటితిన్నెలపైన పడుకుని, మన అమ్మలు, అమ్మమ్మలు నేర్పించిన పాటలు పాడుకుంటూ వుంటే ఇంకా ఇంకా ఆనందంగా ఉండేది. ఆ ఆనందాన్నంతా ధారపోసుకుని లేదా విసిరిపారవేసి, కాంక్రీటు గోడల మధ్య చనిపోయినవాడి ప్రేతాత్మలా నేనెందుకు జీవిస్తున్నానా అనిపించేది. ఎందుకో తెలియదు, క్రూరమృత్యువులాంటి ఘోర విషాదం ఒకటి నీడలా నన్ను వెన్నంటే ఉంటుంది. దానినుంచి నాకు విముక్తే లేదు. చూడు శేఖరం! నీకు జ్ఞప్తిలో వుండేవుంటుంది. చిన్నప్పుడు బస్తీ టెంటులో మనం 'నారద నారది' అనే సినిమా చూశాము. నారదుడికి సంసార సుఖాలు చవిచూడాలన్న కోరిక కలుగుతుంది. అట్లాగేనని అనుగ్రహించి, వెళ్ళి ఎదురుగా ఉన్న జలాశయంలో మునిగి రమ్మంటాడు శ్రీకృష్ణుడు. మునిగిలేచేసరికి నారదుడు నారదిగా మారిపోతాడు. అక్కడితో యాతనలు ప్రారంభం. వేటకోసం వచ్చిన రాకుమారునితో వివాహం, సంసారం. ప్రభవ, విభవ, శుక్ల అంటూ అరవైమంది బిడ్డల జననం, శత్రువులు దండెత్తి రావడం, యుద్ధంలో భర్తృవియోగం, ప్రవాసజీవితం, దుర్భరమైన దరిద్రం. ఆ బాధలన్నీ పడలేక 'అన్నమో రామచంద్రా' అని అలమటిస్తున్న బిడ్డల గోడు చూడలేక ఆ యిల్లాలు ఆత్మహత్యకు తలపడుతూ వెళ్ళి చెరువులో దూకేస్తుంది. లేచేసరికి నారది నారదుడుగా మారిపోయి ఉంటుంది. గట్టుపైన నిల్చున్న కృష్ణుడు 'అబ్బో, ఇంతసేపా స్నానం చేయడం?' అంటాడు. 'అబ్బే ఎంతసేపు, అయిదు నిమిషాలే గదా!' అంటాడు నారదుడు. గడచిన ముప్ఫైయ్యేళ్ళ నా జీవితం గూడా అట్లాగే ఒక భ్రమ కాగూడదా, ఒక మాయ కాగూడదా అని నాకనిపిస్తూ ఉంటుంది."

ముఖంలో నరాలు ఉబ్బిపోయాయి. గుప్పు గుప్పున చెమట పట్టేసింది. ప్రసంగం ఆపి నావైపు వెర్రిచూపులు చూడసాగాడు సోమసుందరం. ఒక గ్లాసు మంచినీళ్ళు త్రాగాక అట్లాగే మంచంపైకి సోలిపోయాడు.

సోమసుందరాన్ని ఎక్కువగా మాట్లాడించడం మంచిది కాదనుకున్నాను. ఆశ్రమంలో ఉండిన ఆ రెండు మూడు రోజుల్లోను అతడి ప్రశ్నలకు జవాబివ్వడం మాత్రమే నా పనిగా పెట్టుకొన్నాను... గుడి ముందర మర్రి వూడలు పటుకుని ఇంకా ఈ రోజుల్లో గూడా పిల్లలాడుకుంటున్నారా? చెరువు నీటిలో ఎర్రటి బల్బులా అల్లి తామరపూలు పూస్తున్నాయా? సంక్రాంతి నెలొస్తే ఆడపిల్లలు గొబ్బి పాటలు పాడుతున్నారా?... ఇలా త్రాగేకొద్దీ ఊరే చెలమలా అతడు ప్రశ్నలడుగుతూ వచ్చాడు. ఒక సందేహం మాత్రం నన్ను వేధిస్తూ ఉండిపోయింది. బోలెడన్ని వ్యాపకాలున్న మనిషి, అన్నింటినీ వదలిపెట్టి ఇలా ఒక అజ్ఞాత ప్రపంచంలోకి వచ్చి కూచోడం ఎలా సాధ్యమైంది అని. 'ప్చ్' అంటూ

నాలుక చప్పరించాడు. "ఫరవాలేదులే శేఖరం! విశ్వాసపాత్రులైన ఉద్యోగులున్నారు. వాళ్ళన్ని వ్యవహారాలు సజావుగా జరిగేటట్టు చూసుకుంటారు. ఉద్యోగులకు జీతాలందినట్టుగానే కుటుంబసభ్యులకు గూడా నెలవారీగా ఎవరికి చేరవలసిన డబ్బు వారికి చేరే ఏర్పాట్లున్నాయి. ఇంక నన్నెవరు తలుస్తారు?" ఈసారి ఉన్మాదిలా నవ్వసాగాడు సోమసుందరం!

తిరుగు ప్రయాణం ఆ రోజు సాయంకాలమనగా ఉదయం ఎనిమిది గంటలప్పుడు మద్రాసీ మిత్రుడు త్యాగరాజన్ లైబ్రరీలో కనిపించాడు. వెళ్ళి ఓ మూలగా కుర్చీల్లో కూచున్నాము. "ఏమండి సార్! ఏమంటున్నారు మీ సోమసుందరంగారు?" అని నన్ను ఆశ్చర్యంలో ముంచేశాడు త్యాగరాజన్.

"అరెరే, మీకెట్లా తెలుసు?"

"మీరొచ్చింది ఆయనకోసరమేనని మాత్రం నిన్ననే తెలిసింది. ఆయన్ను మిమ్మల్ని ఒకేచోట చూసినాక. సోమసుందరంగార్ని ముందే తెలుసు. ఎంతచెడినా నేనూ వ్యాపారినేగదా! అంత పెద్ద బిజినెస్ మాగ్నెట్‌ను గురించి తెలియకుండా ఉంటుందా? పూందమల్లి హైరోడ్డులోనే గదండీ ఆయన బంగళా..."

"సరే సరే, అతణ్ణి గురించి ఏం తెలుసో చెప్పరూ?"

తల పైకెత్తి కొద్ది నిమిషాలపాటు ఇంటివాసాలు లెక్కించాడు త్యాగరాజన్. తర్వాత కళ్ళు మూసుకుని, చెవి నులుముకుంటూ "చెప్పమన్నారా?" అన్నాడు.

"ఫరవాలేదు చెప్పండి" అన్నాను.

"ఎందుకు మిణకరిస్తున్నానంటే, మీ ఫ్రెండ్ కుటుంబ విషయాలు కదండి సార్! ఎట్లయినా మీ మనసుకు నొప్పి కలగకుండా చెప్పాల. ఎట్లా చెప్పాల? అదే ప్రాబ్లం. ఈయనదేమో మొదట సామాన్యమైన స్థితి అంటారు. పెండ్లివల్లనే గొప్ప స్టేటస్‌కు రావటం. భార్యసంగతలా కాదు. పుట్టుకతోనే ఆమె నోట్లో బంగారుచెంచా ఉండిపోయింది. చెప్పుచేతల్లో ఉంటాడనీ, నమ్మకంగా బిజినెస్ అభివృద్ధి చేస్తాడనీ ఈయన్ను ఆమెకు కట్టబెట్టారు. ఆమె సోషల్ వర్కుపైన తిరిగేమనిషి, ఎందరితోనో పరిచయాలున్న మనిషి. అసలామె ప్రపంచమే వేరు. గుణంలో బిడ్డలున్నూ తల్లికి వారసులైపోయిరి. పరుగో పరుగు నేలపైన నిలవరు. వాళ్ళకీరోజు ఇష్టమైంది రేపు ఇష్టంగా ఉండదు. ఎక్కే వాహనమైనా అంతే, చేసే స్నేహాలైనా అంతే, మరేదైనా అంతే! మన దృష్టిలో చెత్తబుట్టలో ఉండే చెత్త కెంత గౌరవమో, వాళ్ళకు తమ దగ్గరుండే డబ్బుపైన అంతే గౌరవం. కసి తీర్చుకుంటున్నట్టుగా, దాంతో ఎంతెంత భ్రష్టుపనులైనా చేస్తారు. అంతెందుకు లెండి...."

అంతకుమించి నేను వినలేకపోయాను. 'అయ్యో, ఈ మద్రాసు నిష్ఠురవాదిని మళ్ళీ ఒకసారి ఎందుకు కలుసుకున్నామబ్బా!' అనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నం భోజనానంతర విరామసమయంలోనే నేను సోమసుందరం దగ్గరినుంచి సెలవు పుచ్చుకున్నాను. "ఒకమాట. నేను నా గొడవల్లోనే నిన్ను విసిగించేశాను. నీ సంసారపు స్థితిగతులు తెలుసుకోనేలేదు" అన్నాడతను.

"ఏముందిలే సోమసుందరం! చెప్పుకోదగ్గ స్థితిగతులేం కావు. పెద్దబ్బాయి హైస్కూలు టీచరు. పదేళ్ళ ఉద్యోగ జీవితంలో వాడొక ప్లాట్ కొనుక్కోగలిగాడు. అందులో ఇల్లు కట్టుకోవాలన్నది వాడి జీవితాశయం. రెండోవాడు రెవెన్యూ డిపార్టుమెంటులో గుమాస్తా. ప్రమోషను లభించి, అందు మూలంగా అరియర్స్ డబ్బులేవైనా చేతికొస్తే ఇంటినుంచి

ఆఫీసుకు వెళ్ళిరావడం కోసం ఓ స్కూటరు కొనుక్కోవాలన్నది ప్రస్తుతానికి వాడి లక్ష్యం. అమ్మాయికి ముగ్గురు బిడ్డలు, అల్లుడొక ప్రయివేటు ఫర్మ్‌లో అకౌంటెంటు. బిడ్డలు పెరిగిన కొద్దీ ఖర్చులు గూడా పెరుగుతాయి గనుక కాస్త వెసులుబాటుగా ఉంటుందని అమ్మాయిగూడా ఇటీవల చిన్న ఉద్యోగంలో చేరింది. ఇక మిగిలిన వాళ్ళం మేమిద్దరం. నా పెన్షన్ డబ్బులు మాకు సరిపోతున్నాయి...." అన్నాను.

"సంతోషం నువ్వు చాలా గొప్పవరం అడిగొచ్చావు శేఖరం! వెళ్ళిరా!"అన్నాడు సోమసుందరం.

నేను దారి పొడుగునా ఆలోచిస్తూ ఉండిపోయాను. ఎంతగా ఆలోచించినా సోమసుందరం ఆంతర్యమేమిటో బోధపడిందిగాదు. నా సంసార పరిస్థితుల్ని గురించి నేను ఉత్ప్రేక్షించినదేమీలేదు. ఉన్నదున్నట్టుగానే చెప్పాను. 'ఖర్చులకు బొటాబొటిగా సరిపోయే సంపాదన' అన్న భావమే గదా నా మాటల్లో ధ్వనించింది! అప్పటికదే నేను కోరుకున్న గొప్ప వరమా! ఏమిటోమరి. నేనింకా ఆలోచిస్తూనే ఉన్నాను.

♦ ఇండియాటుడే పక్షపత్రిక - 1990 ♦